ప్రజాశక్తి
మంగళవారం 25 నవంబర్ 2025

1 నుంచి చిరుతపులుల లెక్కింపు

డిఎఫ్ఒ చక్రపాణి

అటవీ ప్రాంతంలో నగరవనం ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలిస్తున్న డిఎఫ్ఒ చక్రపాణి

ప్రజాశక్తి-మడకశిర టౌన్

జిల్లాలో డిసెంబర్ 1వ తేదీ నుండి చిరుతపులుల లెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహిస్తామని జిల్లా ఫారెస్ట్ అధికారి చక్రపాణి తెలిపారు. సోమవారం ఆయన పెనుకొండ సబ్ డీఎఫ్‌వో శ్రీనివాసరెడ్డితో కలిసి మడకశిర సమీపంలోని అటవీ ప్రాంతాన్ని సందర్శించారు. అటవీ ప్రాంతంలో నగరవనం ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ నాలుగేళ్లకోసారి చిరుతపులులను లెక్కిస్తామని తెలిపారు. వీటితో పాటు ఇతర వన్యప్రాణులనూ లెక్కిస్తామని తెలిపారు. ఈ లెక్కింపు ప్రక్రియను పూర్తి చేయడానికి డిసెంబర్ 1 నుండి 8 వ తేదీ వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. మూడు రోజుల పాటు చిరుతపులులు, మూడు రోజులు శాఖాహార అడవి జంతువులను లెక్కింపు చేస్తామని తెలిపారు. పట్టణ సమీపంలోని ఫారెస్ట్ లో నగర వనం ఏర్పాటు చేసేందుకు రూ.2కోట్లతో ప్రతిపాదనలు పంపామన్నారు. ఈ నెలలో నిధులు మంజూరు అవుతాయని తెలిపారు. నగర వనంలో ఆహ్లాదకరమైన పార్క్ ఏర్పాటు చేసి వృద్ధులు, చిన్న పిల్లలకు ప్రత్యేకంగా సౌకర్యాలు ఏర్పాటు చేస్తామన్నారు. వాకింగ్ ట్రాక్, క్యాంటీన్ సౌకర్యం ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులో తీసుకువస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మడకశిర బీట్ ఆఫీసర్ దివాకర్ పాల్గొన్నారు.

విజయ దీపిక..!

అంధుల టీ-20 క్రికెట్ ప్రపంచ కప్‌తో దీపిక

ఆమె లక్ష్యం ముందు వైకల్యం చిన్నబోయింది.. అనుకున్నది సాధించాలనే తపన విజయతీరాన్ని చేర్చింది... చూపు లేదంటూ చిన్నచూపు చూసిన వారికి తన విజయంతో సమాధానం చెప్పింది. పుట్టెడు దు:ఖాన్ని తన పట్టుదలతో జయించి అందరి చేత ఔరా అనిపించుకుంది. కుగ్రామం నుంచి మొదలైన ఆమె ప్రస్థానం దేశ క్రికెట్‌లో రథసారథిని చేసింది. సాధించాలనే తపన.. తల్లిదండ్రుల కోరిక నెరవేర్చాలనే కసి విజయ'దీపిక'గా మారి పలువురికి ఆదర్శంగా నిలిచింది.

- వైకల్యాన్ని జయించిన లక్ష్యం
- అంధుల క్రికెట్‌లో రాణించిన టిసి.దీపిక
- కుగ్రామం నుంచి జట్టు సారథిగా ప్రస్థానం
- మహిళా అంధుల ప్రపంచకప్ గెలవడంలో కీలకపాత్ర
- మడకశిర ప్రాంతంలో హర్షాతిరేకాలు

ప్రజాశక్తి-అమరాపురం, మడకశిర టౌన్

టిసి.దీపిక... రెండు రోజుల క్రితం వరకు ఈ పేరు చాలా మందికి తెలియదు. క్రికెట్‌ను ఇష్టపడే వారిలో అతికొద్ది మందికి మాత్రమే ఈమె తెలుసు. అలాంటి అతి సాధారణ యువతి నేడు దేశం గుర్తించే స్థాయికి ఎదిగింది. చిన్న తనంలోనే చూపును కోల్పోయిన ఆమె పట్టుదలతో అనుకున్న లక్ష్యం వైపు పరుగులు తీసింది. తనకు ఇష్టమైన క్రికెట్‌లో సత్తా చాటి అందరి చేత మన్ననలు పొందుతోంది. దీపిక భారత దేశ అంధుల క్రికెట్ జట్టుకు నాయకత్వం వహించడమే కాకుండా దేశానికి తొలి అంధుల మహిళా టీ-20 ప్రపంచకప్‌ను అందించింది. చిరస్మరణీయమైన విజయాన్ని దేశానికి అందించిన యువతి శ్రీ సత్యసాయి జిల్లాకు చెందినది కావడంతో ఈ ప్రాంతం వాసులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

మట్టిలో మాణిక్యం

శ్రీసత్యసాయి జిల్లా అమరాపురం మండలం హేమవతి పంచాయతీ తంబాలహట్టి గ్రామానికి చెందిన చిక్క తిమ్మప్ప, చిత్తమ్మ దంపతులకు ఒక కుమార్తె, ఇద్దరు కుమారులున్నారు. వీరిలో మొదటి సంతానం దీపిక. వారికున్న రెండు ఎకరాల పొలంలోనే వ్యవసాయం, కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించేవారు. దీపికకు ఐదు నెలల వయస్సున్నప్పుడు ఆమె చేతిగోరు తగిలి ఒక కంటి చూపును పూర్తిగా కోల్పోయింది. తల్లిదండ్రులు పలు ఆసుపత్రుల్లో చూపించినా చూపు దక్కలేదు. తొలి సంతానంలో జన్మించిన ఇంటి మహాలక్ష్మి కనుచూపు పోవడంతో తల్లిదండ్రులు తీవ్ర మనోవేదనకు గురయ్యారు. ఈ కష్టాన్ని దిగమింగుకుని తమ కూతురికి చూపు లేదన్న బాధను తెలియకుండా ఆమెను ఉన్నత స్థాయిలోకి చేర్చాలని తల్లిదండ్రులు చిక్క రంగప్ప, చిత్తమ్మ దంపతులు నిర్ణయించుకున్నారు. అందులో భాగంగా ఆమెను బాగా చదవించాలనుకున్నారు. వీరి గ్రామం సత్యసాయి జిల్లాకు సరిహద్దున కర్నాటక రాష్ట్రానికి అతి సమీపంలో ఉంటుంది. దీంతో ఆమె విద్యాభ్యాసం అంతా కర్నాటకలోనే సాగింది. దీపిక దొడ్డబానిగేరలో ఒకటవ తరగతి నుంచి ఏడవ తరగతి, తుంకూర్ జిల్లా కునిగల్ అంధ కళాశాలలో డిగ్రీని పూర్తి చేసింది. క్రికెట్లో దీపిక ప్రతిభను గుర్తించి ఉపాధ్యాయులు పాఠశాల స్థాయి అనంతరం కర్నాటకలోని మైసూర్‌లో ప్రత్యేక శిక్షణ ఇప్పించారు. అక్కడే అంధుల పాఠశాలలో చదువుతో పాటు క్రికెట్‌లోనూ రాటుదేలింది.

చిన్నతనం నుంచే క్రికెట్‌పై మక్కువ



తల్లిదండ్రులతో దీపిక

దీపిక చిన్నతనం నుంచే చదువుతో పాటు క్రికెట్‌పై ముక్కువ పెంచుకుంది. 8వ తరగతిలో ఉండగానే పాఠశాల స్థాయిలో క్రికెట్ ఆడడం మొదలు పెట్టింది. 10 తరగతిలో ఉండగా అంధుల రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని సెంచరీ చేసింది. 2019లో జాతీయ అంధుల మహిళా జట్టు ప్రారంభమైంది. అదే సమయంలో కర్నాటక జట్టు కెప్టెన్‌గా ఎంపికైంది. ఆపై భారత జట్టులో చోటు సంపాదించింది. 2023లో ఇంగ్లాండ్‌లో జరిగిన ప్రపంచ అంధ మహిళ క్రికెట్ టీం-20 వరల్డ్ గేమ్స్(ఐబీ యస్ఎ)లో పాల్గొని అద్భుత ఆట తీరు కనబరిచింది. క్రికెట్‌లో చూపిన ప్రతిభతో ఆమెకు క్రీడాకోటాలో ముంబైలోని ఆదాయపు పన్ను శాఖ కార్యాలయంలో ఉద్యోగం వచ్చింది. ఉద్యోగం చేస్తూనే అంధుల టీ-20 ప్రపంచ కప్‌లో కెప్టెన్‌గా ఎంపికైంది. జట్టుకు నాయకత్వం వహించడమే కాకుండా బ్యాటర్‌గా రాణించి తొలి ప్రపంచకప్‌ను దేశానికి అందించడంలో కీలకపాత్ర పోషించింది.

దీపిక తల్లిదండ్రులను సత్కరిస్తున్న మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి

మడకశిర ఆణిముత్యం

మహిళ అంధుల టీ-20 కెప్టెన్‌గా దేశానికి తొలి ప్రపంచకప్‌ను అందించిన దీపిక మడకశిర ఆణిముత్యం. ఆమె ఈ ప్రాంత వాసికావడం ఎంతో గర్వకారణం. కూతురిని ఉన్నత స్థానంకు తీసుకెళ్లేందుకు తల్లిదండ్రులు చిత్తమ్మ, చిక్క తిమ్మప్పలు చేసిన కృషి అభినందనీయం. భవిష్యత్తులో దీపిక ఎదుగుదలకు తమవంతు సహకారం అందిస్తాం.

మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి.

మడకశిరను ప్రపంచానికి చాటింది

క్రికెట్ చరిత్రలో దీపిక భారతదేశానికి చారిత్రక విజయాన్ని అందించడం గర్వకారణ. ఆమె ఆత్మవిశ్వాసం, మనోధైర్యం, పట్టు సడలని సంకల్పాన్ని యావత్తు దేశం మెచ్చుకుంటోంది. అలాంటి యువతి మడకశిర ప్రాంత వాసి కావడం ఈ ప్రాంత వాసులకు ఎంతో ఆనందాన్ని ఇస్తోంది. ఎక్కడో మారుమూల ఉన్న మడకశిరను ఏకంగా ప్రపంచానికే పరిచయం చేసిన దీపిక సేవలు చిరకాలం గుర్తింటాయి.

ఎంఎస్.రాజు, మడకశిర ఎమ్మెల్యే.

గర్వంగా ఉంది

తమ బిడ్డ సాధించిన ఘనత చూస్తే చాలా గర్వకంగా ఉంది. క్రికెట్ ప్రపంచ కప్‌ను దేశానికి అందించిన జట్టుకు తమ కూతురు నాయత్వం వహించడం ఎన్నటికీ మర్చిపోలేం. తమ కూతురి విజయాన్ని మెచ్చుకుంటూ చాలా మంది ఫోన్లు చేసి అభినందిస్తున్నారు. తమ బిడ్డను వారందరూ పొగుడుతుంటే గర్వంగా ఉంది.

చిక్క తిమ్మప్ప, చిత్తమ్మ దీపిక తల్లిదండ్రులు.

అనుమతులు లేని కట్టడాలు కూల్చివేస్తాం

బిపిఎస్ ద్వారా క్రమబద్ధీకరణ చేసుకోండి
మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున

విలేకరులతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున

ప్రజాశక్తి-హిందూపురం

ప్రభుత్వ ఆదేశాల మేరకు పురపాలక సంఘ వ్యాప్తంగా అనుమతి లేని భవనాలు, అదనపు అంతస్తులు, అక్రమ నిర్మాణాలను కూల్చి వేస్తామని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున తెలిపారు. బీపీఎస్-2025పై సోమవారం నాడు తన ఛాంబర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కమిషనర్ పలు వివరాలు వెల్లడించారు. అనుమతులు లేకుండా నిర్మించిన భవనాలను క్రమబద్ధీకరణ చేసుకునేందుకు ప్రభుత్వం బీపీఎస్ ద్వారా అవకాశం కల్పించిందన్నారు. బిల్డింగ్ పీనలైజేషన్ స్కీం(బిపీస్)-2025 కింద క్రమబద్ధీకరణ చేసుకోవచ్చన్నారు. 1985 జనవరి 1వ తేదీ నుంచి 2025 ఆగస్టు 31వ తేదీ వరకు అనుమతులు లేకుండా నిర్మాణం చేసిన భవనాలతో పాటు అనుమతులు పొంది నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేసిన భవనాలన్నింటినీ ఈ పథకం ద్వారా క్రమబద్ధీకరించుకోవచ్చు అన్నారు. హిందూపురం పురపాలక సంఘంలో దాదాపు 400 వరకు అక్రమ నిర్మాణాలు ఉన్నట్లు ఇప్పటికే గుర్తించామన్నారు. సచివాలయాల్లో ఉన్న ప్లానింగ్ సెక్రటరీలతో పాటు పట్టణ ప్రణాళిక విభాగ సిబ్బంది ఇంటింటి సర్వే చేపడతామన్నారు. అక్రమ నిర్మాణం అని గుర్తించిన వెంటనే వారికి నోటీసు ఇచ్చి బిపిఎస్ పథకం ద్వారా సక్రమం చేసుకోవాలని సూచిస్తామన్నారు. అప్పటికి వారు స్పందించకపోతే ప్రభుత్వ ఆదేశాల మేరకు అలాంటి నిర్మాణాలను కూల్చివేస్తామన్నారు. ఇప్పటికే పురపాలక సంఘంలో దాదాపు 90 వరకు అక్రమ నిర్మాణాలను గుర్తించి ఛార్జ్ షీట్ వేయడం జరిగింది. వీరు కూడా బిపిఎస్ పథకం ద్వారా సక్రమం చేసుకోవడానికి ప్రభుత్వం అవకాశమిచ్చినట్లు వివరించారు. అక్రమ నిర్మాణాలను సక్రమం చేసుకునేవారు రూ.10వేలు చెల్లించి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను చేసుకోవాలన్నారు. వచ్చిన దరఖాస్తులను పరిశీలన చేసి మొత్తం ఎంత చెల్లించాలో పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు ఆయా భవనాల యజమానులకు వివరిస్తారన్నారు. అక్రమ లేఅవుట్లు సక్రమం చేసుకోవడానికి సైతం ప్రభుత్వం అవకాశం ఇచ్చిందన్నారు. ఈ సమావేశంలో ఏసీపీ చంద్రమ్మ, టిపిఒ అబ్దుల్ సత్తార్ పాల్గొన్నారు.

15న డప్పు కళాకారుల జిల్లా మహాసభ

మహాసభ కరపత్రాలు విడుదల చేస్తున్న కెవిపిఎస్ నేతలు

ప్రజాశక్తి-రొద్దం

డిసెంబర్ 15వ తేదీ పుట్టపర్తిలో డప్పు కళాకారుల మహాసభ నిర్వహిస్తున్నట్లు కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రమణ తెలిపారు. ఈ మేరకు సోమవారం రొద్దంలో కెవిపిఎస్ అనుబంధ, డప్పు కళాకారుల సంఘం ఆధ్వర్యంలో మహాసభ కరపత్రాలు పంపిణీ చేశారు. రమణ మాట్లాడుతూ డప్పు కళాకారుల పింఛను రూ. 7వేలకు పెంచాలని, భూమిలేని పేదలకు రెండెకరాల భూమి, ఇంటి స్థలం ఇవ్వాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యలపై మహాసభలో చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని తెలపారు. ఆమహాసభలో మండలం నుంచి డప్పు కళాకారులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు జ్యోతి, బాలు, ఈశ్వర్, వెంకటేశులు, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి ఆధ్వర్యంలో 'రైతన్నా మీకోసం'

ప్రజాశక్తి-చెన్నేకొత్తపల్లి

ఎమ్మెల్యే పరిటాల సునీత ఆదేశాల మేరకు సోమవారం టిడిపి ఆధ్వర్యంలో మండలం లోని ప్యాదిండి గ్రామంలో 'రైతన్నా మీ కోసం' కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా ఎడిఎ లక్ష్మానాయక్, ఏవో మురళీకృష్ణ, నాయకులు ఇంటింటి ప్రచారం, సర్వే చేపట్టారు. టిడిపి మండల కన్వీనర్ ముత్యాలరెడ్డి మాట్లాడుతూ సర్వేలో ప్రతి రైతు తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలన్నారు. రైతులు పంట మార్పిడి విధానం పాటించాలన్నారు. రైతుకు ఏదైనా సమస్య ఉంటే మా దృష్టికి తెస్తే వెంటనే అధికారులతో చర్చించి పరిష్కరించడానికి ఇది సులువైన మార్గం అన్నారు. కార్యక్రమంలో ఎంపిఇఒ రామ్మోహన్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

సోమందేపల్లి : కూటమి ప్రభుత్వం రైతు పక్షపాతి అని సగర ఉప్పర కార్పొరేషన్ ఛైర్మన్ రంగేపల్లి వెంకటరాముడు తెలిపారు. స్థానిక నల్లగొండ రాయనపల్లి గ్రామంలో టిడిపి ఆధ్వర్యం లో 'రైతన్నా మీకోసం' కార్యక్రమం చేపట్టారు. అందులో ఎంపిడిఒ వెంకటలక్ష్మమ్మ, ఇన్‌ఛార్జి తహశీల్దార్ మండల వ్యవసాయ అధికారిని విజయభారతి పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేపట్టిందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా అధికారులే రైతు ఇంటి దగ్గరికి వచ్చి పంటల సాగులో మెలకువలు తెలియజేయడంతో పాటు ప్రభుత్వం రైతులకు అందిస్తున్న సబ్సిడీలు, వ్యవసాయ ఆధునీకరణ, మార్కెట్లో మెరుగైన ధర, తదితర విషయాలను వివరిస్తారన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ వెంకటేష్, సిద్ధిలింగప్ప, హరికృష్ణ, టౌన్ కన్వీనర్ వడ్డే సూరి, కిష్టప్ప, భాను, కీర్తి, శీన, రైతులు పాల్గొన్నారు.

వికలాంగుల పింఛన్లు మంజూరు చేయాలి

డిప్యూటీ తహశీల్దార్ రెడ్డి శేఖర్‌కు వినతి పత్రం ఇస్తున్న సిపిఎం, ప్రజా సంఘాల నాయకులు

ప్రజాశక్తి-సోమందేపల్లి

ప్రభుత్వం వికలాంగులకు కొత్త పింఛన్లు మంజూరు చేయాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌ను వినియోగంలోకి తీసుకురావాలని కోరారు. ఈ మేరకు సోమవారం సిపిఎం మండల కమిటీ సభ్యులు మాబు అధ్యక్షతన స్పందనలో సిపిఎం, ప్రజా సంఘాల నాయకులు డిప్యూటీ తహశీల్దార్ రెడ్డి శేఖర్‌కు వినతి పత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ నూతన పింఛన్ల కోసం వికలాంగులు దరఖాస్తు చేసుకోవాలని 10 రోజుల క్రితమే ప్రభుత్వం తెలిపిందన్నారు. దీంతో వికలాంగులు గ్రామ సచివాలయాల వద్దకు వెళ్లగా వెబ్‌సైట్ ఓపెన్ కావడం లేదని అక్కడి సిబ్బంది తెలుపుతున్నారన్నారు. ఇప్పటివరకూ ఎక్కడా ఒక్క దరఖాస్తు కూడా నమోదు చేసుకోవడం సాధ్యం కాలేదన్నారు. సోమందేపల్లిలో రూ. లక్షలు ఖర్చు చేసి నిర్మించిన ఆర్టీసీ బస్టాండ్ వృథాగా పడి ఉందన్నారు. ఈ విషయాన్ని ప్రజాసంఘాలు అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పుడు మాత్రమే నాలుగైదు రోజులు ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో బస్సులు నిలుపుతారని, ఆ తర్వాత షరామామూలే అన్నారు. పెద్దమ్మ గుడి బస్టాండ్ సర్కిల్‌లో కూర్చోవడానికి సౌకర్యాలు లేక వద్ధులు, చిన్నపిల్లలు, వికలాంగులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కావున ఆర్టీసీ బస్టాండ్‌ను వినియోగంలోకి తెచ్చి బస్సులను నిలిపేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కొండా వెంకటేశులు, ఈడిగ నాగరాజు, వ్యకాసం జిల్లా కమిటీ సభ్యులు పెద్దన్న, బెస్త కిష్టప్ప, కల్లు గీత కార్మిక సంఘం రామకృష్ణ, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు నాగభూషణం, చేనేత కార్మిక సంఘం నాయకులు జింకా నాగరాజు, సంజీవప్ప, కుమ్మరి కిష్టప్ప, మాల సంజీవ, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ గృహాలు ఇవ్వడమే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి-రొద్దం

రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ గృహాలు నిర్మించి ఇవ్వడమే ప్రభుత్వ లక్ష్యమని మండల టిడిపి నాయకులు తెలిపారు. రాష్ట్ర మంత్రి సవిత ఆదేశాల మేరకు సోమవారం టిడిపి నాయకులు మండలంలోని ఆర్.మరువపల్లి గ్రామంలోని బిసి, ఎస్సీ కాలనీల్లో పర్యటించారు. వారు మాట్లాడుతూ ఇల్లు లేని వారిని గుర్తించి ఇళ్లు మంజూరు చేసేందుకే గ్రామంలో పర్యటిస్తున్నామన్నారు. అలాగే ఇళ్ల మంజూరు కోసం రొద్దం సచివాలయం-2 అధికారి వైవిధ్య, కూటమి నాయకులు జియో ట్యాగింగ్ చేపట్టారు. కార్యక్రమంలో రొద్దం సొసైటీ అధ్యక్షులు వీరాంజనేయులు, పంచాయతీ కన్వీనర్ చిరంజీవి, బూత్ కన్వీనర్ జయరాములు, డీలర్ల సంఘం అధ్యక్షులు సిద్ధన్న, చెన్నకేశవులు, రొద్దం, చిన్నచెరువు ప్రెసిడెంట్ క్రిష్టప్ప, చంద్రశేఖర్, సుధాకర్, రఘు, తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ మృతి.. పలువురి నివాళి

ప్రజాశక్తి-గుడిబండ

మండలంలోని శంకరగల్లు గ్రామంలో ఆశా వర్కర్‌గా పని చేస్తున్న లక్ష్మీనరసమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. శంకరగల్లు గ్రామానికి చెందిన లక్ష్మీనరసమ్మ వైద్య ఆరోగ్యశాఖలో పదేళ్లుగా పైగా ఆశా వర్కర్‌గా పని చేస్తుండేది. 6 నెలలుగా అనారోగ్యంతో బాధపడుతోంది. కుటుంబ సభ్యులు లక్షలాది రూపాయలు ఖర్చు చేసి పలు ప్రయివేట్ ఆసుపత్రుల్లో చికిత్స చేయించినా ఫలితం లేకపోయింది. అనంతపురం నగరంలోని ఓ ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందింది. ఆమెకు ఓ కుమార్తె మాత్రమే ఉంది. ఆమె ప్రస్తుతం 8 నెలల గర్భిణి. విషయం తెలుసుకున్న టిడిపి, వైసిపి, కాంగ్రెస్ పార్టీల నాయకులు, ఆశా వర్కర్ల మండల యూనియన్ నాయకులు, వివిధ గ్రామాల ఆశా వర్కర్లు సోమవారం శంకరగల్లు గ్రామం వెళ్లి లక్ష్మీనరసమ్మ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు నాయకులు ఆమె సేవలను కొనియాడారు. ఆమె మృతి బాధాకరమన్నారు. లక్ష్మీ నరసమ్మ ఉద్యోగం ఆమె కుమార్తెకు ఇవ్వాలని కోరారు.

రైతుల సమస్యలపై నిర్లక్ష్యం వద్దు : మంత్రి

వ్యవసాయ శాఖ అధికారులతో చర్చిస్తున్న మంత్రి సవిత

ప్రజాశక్తి-పెనుకొండ

రైతుల సమస్యలపై ఏమాత్రం నిర్లక్ష్యం వద్దని, తక్షణం స్పందించి పరిష్కరించాలని మంత్రి సవిత ఆదేశించారు. పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో సోమవారం నియోజకవర్గ వ్యవ సాయశాఖ అధికారులతో సమీక్ష, సమావేశం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ 'అన్నదాత సుఖీ భవ' పథకం నగదు రైతుల ఖాతాల్లో జమ కాకపోవడం, ఈకేవైసీ పూర్తి కాకపోవడం, బ్యాంకు ఖాతాల కు ఆధార్ అనుసంధాన లోపం, ఎన్‌పిసిఐ లింక్ సమస్యలు, కుటుంబంలో ఇద్దరు లబ్ధిదారులు ఉండటం, తదితర సమస్యలను త్వరితగతిన పరిష్కరించా లన్నారు. అన్నదాత సుఖీభవ పథకం గురించి ఇంటింటా ప్రచారం నిర్వహించి, అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో ఎడిలు కృష్ణమీనన్, కృష్ణయ్య, ఉప్పర కార్పొరేషన్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటరమణ, యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కేశవయ్య, మండల వ్యవసాయ అధికారులు, త్రివేంద్రనాయుడు, వెంకటేశులు, నాయకులు పాల్గొన్నారు.

'స్థానిక' ఎన్నికల్లో టిడిపి జెండా ఎగరాలి

పెనుకొండ : స్థానిక సంస్థల ఎన్నికల్లో టిడిపి మద్దతుదారుల గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మంత్రి సవిత సూచించారు. పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో నియోజవర్గం లోని క్లస్టర్, యూనిట్ ఇన్‌ఛార్జిలతో సమావేశం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ బూత్ కన్వీనర్లు, యూనిట్, క్లస్టర్ ఇన్‌ఛార్జిలు, గ్రామ, మండల, పట్టణ స్థాయి నాయకులు పార్టీకి వెన్నెముక అన్నారు. ప్రతి ఒక్కరూ సమర్థవంతంగా పని చేస్తే పార్టీ మరింత బలోపేతం అవుతుందన్నారు. పార్టీలో పదవి దక్కడం గౌరవప్రదమైన అంశం అన్నారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తకూ తప్పకుండా గుర్తింపు దక్కుతుందన్నారు. అప్పుల్లో కూరుకుపోయిన రాష్ట్రాన్ని సిఎం చంద్రబాబు అభివృద్ధి పథంలో తీసుకెళ్తున్నారన్నారు. సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో సగర కార్పొరేషన్ ఛైర్మన్ వెంకటరమణ, యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కేశవయ్య, నాయకులు మాధవనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై ఉలవలు పంపిణీ

ప్రజాశక్తి-గుడిబండ

మండలంలోని మద్దనకుంట గ్రామ రైతు సేవా కేంద్రంలో సోమవారం వ్యవసాయ అధికారులు, టిడిపి నాయకులు రైతులకు రాయితీపై ఉలవలు పంపిణీ చేశారు.టిడిపి మండల కన్వీనర్ లక్ష్మీనర సప్ప, సింగిల్‌విండో డైరెక్టర్ ప్రకాష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేపడుతుందన్నారు. ఖరీఫ్ సీజన్‌లో రాయితీపై విత్తన వేరుశనగ అందించిందన్నారు. ప్రస్తుతం మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు అవసరమైన విలువలను రాయితీ పై అందజేస్తుందన్నారు. రైతులు ఉలవ పంటను సాగు చేసి అధిక దిగుబడి సాధించాలన్నారు. ఉలవలకు మార్కెట్‌లో మంచి ధర లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఎఇఒ అపర్ణ, వెటర్నరీ అసి స్టెంట్ రమేష్, టిడిపి నాయకులు ఎ.షబ్బీర్, దాసప్ప, మూడ్లగిరియప్ప, నారాయణప్ప, నరసింహ స్వామి, సిద్దేశ్వర, హనుమంతరాయప్ప, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

'నేతన్న నేస్తం' అమలు చేయాలి



ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తున్న చేనేత కార్మిక సంఘం నాయకులు

ప్రజాశక్తి-పెనుకొండ

చేనేత కార్మికులకు 'నేతన్న నేస్తం' పథకం అమలు చేయాలని ఎపి చేనేత కార్మిక సంఘం నాయ కులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆ సంఘం ఆధ్వర్యంలో మండల సమితి నాయకులు ఆర్డీవో ఆనందకుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఎపి చేనేత కార్మిక సంఘం జిల్లా నాయకులు శీలా నారాయణస్వామి మాట్లాడు తూ చేనేత ముడిసరకు ధరలు పెరిగిపోవడం, నేసిన చీరలకు గిట్టుబాటు ధర లేకపోవడం, పవర్‌లూమ్స్‌తో పోటీ పడలేక చేనేత వ్యవస్థ నానాటికీ అంతరించిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే నేతన్న నేస్తం ద్వారా పెట్టుబడి సాయంగా ఏటా రూ. 25వేలు ఇవ్వాలని, 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను యుద్ధ ప్రాతిపది కన అమలు చేయాలని, 50ఏళ్లు నిండిన ప్రతి చేనేత కార్మికునికి పింఛను మంజూరు చేయాలని, మర మగ్గాల పోటీ నుంచి చేనేతను కాపాడాలంటే 90 శాతం రాయితీతో ఎలక్ట్రానిక్ జాకార్డ్ మిషన్లు పంపిణీ చేయాలని, సోమందేపల్లిలో 164 మంది తో ఏర్పాటు చేసిన చేనేత క్లస్టర్‌లో అనర్హులను తొలగించి నిజమైన కార్మికులకు న్యాయం చేయా లని కోరారు. కార్యక్రమంలో దాసరి సుధాకర్, బెస్త కృష్ణప్ప, ఎం.ఈశ్వర్, దేవాంగం వెంకటేశు, ఈడిగ నాగరాజు, ఎస్.రమేష్, శంకరప్ప, బెస్త వెంకటేశులు, కుమ్మర సంజీవ, రమేష్, రామదాసు పాల్గొన్నారు.

ప్రతిభా విద్యార్థికి ప్రశంస

రాష్ట్రస్థాయి పోటీల్లో కదిరి విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి - కదిరి టౌన్

ఈనెల 23వ తేదీ నంద్యాలలో జరిగిన 8 వ రాష్ట్ర స్థాయి స్కయ్ స్పోర్ట్స్ మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో కదిరి విద్యార్థి ప్రతిభ కనపర్చింది. కదిరికి చెందిన చాందిన 58 కేజీల విభాగంలో బంగారు పతకాన్ని సాధించింది. ఈ పోటీలో గెలుపొందిన చాందిని 2026 సంవత్సరం జనవరి 5 వ నుండి 7 వరకు హైదరాబాద్ గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. ప్రతిభా విద్యార్థినిస్కయ్ స్పోర్ట్స్ మార్షల్ ఆర్ట్స్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి ఇబ్రహీం, రాష్ట్ర చైర్మన్ ఇస్మాయిల్ సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ విజయానికి కారుకులైన మాస్టర్ షాకీర్‌ని కూడా అభినందించారు.

30లోపు పరీక్ష ఫీజు చెల్లించాలి

ప్రజాశక్తి - కొత్తచెరువు

2026 మార్చి 16వ తేదీ నుండి ఏప్రిల్ ఒకటవ తేదీ వరకు నిర్వహించే పదోతరగతి పరీక్షలకు మాజరుకావటానికి విద్యార్థులు ఈనెల 30వ తేదీ లోపల ఎలాంటి అపరాధ రుసుము లేకుండా చెల్లించాలని ఆ విధంగా ఫీజులు విద్యార్థుల చేత కట్టించాలని డీఈవో కిష్టప్ప తెలిపారు. పరీక్షా ఫీజులు చెల్లించే సమయంలో విద్యార్థి యొక్క మీడియం తప్పుగా ఉన్నట్టయితే వాటిని సరిచేసుకోవచ్చని చెప్పారు. అపార్ కంప్లీట్ గాన వారు ఆధార్ అడ్మినిస్ట్రేషన్ రిజిస్టర్ ద్వారా తల్లిదండ్రుల అనుమతి పత్రంతో విద్యార్థుల వివరాలను ఆన్లైన్లో నమోదు చేసుకోవచ్చన్నారు.

పారిశుధ్యం మెరుగవ్వాలి : చైర్మన్

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణ వ్యాప్తంగా పారిశుధ్య పనులు మరింత మెరుగ్గా నిర్వహించాలని మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్ సూచించారు. సోమవారం తెల్లవారు జామున ఆయన మొదటి డివిజన్‌లో పర్యటించారు. కార్మికుల హాజరు పట్టికను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విధుల్లో ఉన్న అధికారులు, కార్మికులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్‌పెక్టర్ శంకర్, వివిధ వార్డుల పారిశుధ్య కార్మికులు, మేస్త్రీలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణంలోని గాంధీ సర్కిల్ లో నూతనంగా నిర్మిస్తున్న లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయ అభివృద్ధికి దాతలు సోమవారం రూ. 2,01,116విరాళంగా అందజేశారు. షిరిడి సాయి ఆగ్రోస్ మమత, భరత్ శాశ్వత సభ్యత్వం కింద సంబంధిత విరాళాన్ని అందజేశారు. శాశ్వత సభ్యత్వం కింద రూ.2 లక్షల విరాళం అందించడం పట్ల ఆలయ కమిటీ ప్రతినిధులు దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

సేవా కార్యక్రమాలు

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

సత్య సాయిబాబా 100వ జన్మదిన వేడుకల సందర్భంగా ధర్మవరం పట్టణంలోని 13వ వార్డ్ యాదవ వీధిలో జనసేన పార్టీ నాయకులు డిష్ రాజు సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. అనంతరం దుస్తులు పంపిణీ చేసి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సత్యసాయి సేవా స్ఫూర్తితో ఈ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. రక్తదానం చేసిన దాతలకు ప్రశంస పత్రాలు అందజేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొని ప్రజలకు అన్నదానం చేశారు. అదేవిధంగా డిష్ రాజు యాదవ వీధిలో నిర్మిస్తున్న వినాయకుని ఆలయానికి లక్ష రూపాయలు, ఓడిసి మండలంలో నిర్మిస్తున్న శివాలయానికి 50 వేల రూపాయలు విరాళంగా శ్రీ చిలకం మధుసూదన రెడ్డి చేతులమీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వికలాంగులకు క్రీడా పోటీలు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని వికలాంగులకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు శ్రీ సత్య సాయి జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి ఉదయ భాస్కర్ తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 27న పెనుగొండ క్రీడా వికాస కేంద్రంలో వికలాంగులకు బ్యాడ్మింటన్ ,ఫెన్సింగ్, పవర్ లిఫ్టింగ్, అట్లాటిక్స్, షాట్ పుట్, లాంగ్ జంప్, 100 మీటర్ల పరుగు పందెం, క్రీడలు నిర్వహిస్తున్నారు. ఆసక్తిగల క్రీడాకారులు ఈనెల 26 సాయంత్రం ఐదు గంటల లోపు తమ ఆధార్ కార్డు వికలాంగ ధ్రువీకరణ పత్రంతో పేరు నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

ఆటోనగర్‌లో మౌలిక సదుపాయాలు కల్పించండి

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణ పరిధిలోని ఆటోనగర్ లో మౌలిక సదుపాయాలు కల్పించాలని స్థానికులు సోమవారం ఎమ్మెల్యే కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఆటోనగర్ లో రహదారులు, మురికి కాలువలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని వాపోయారు. మురికి కాలువలు లేక వర్షపు నీరు ఎక్కడపడితే అక్కడ నిలువ ఉండడంతో దోమలు పెరిగిపోయి అనారోగ్యానికి గురవుతున్నట్లు తెలిపారు. ఈ విషయంలో తగు చర్యలు తీసుకొని ఆటోనగర్ లో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకోవాలని టిడిపి నియోజకవర్గ సమన్వయకర్త పావులూరు శ్రీనివాసరావుకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆటోనగర్ వాసులు పాల్గొన్నారు.

రాజకీయంగా ఎదుర్కోలేకనే అక్రమ కేసులు : వైసిపి

విలేకరుల సమావేశంలో పాల్గొన్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి-హిందూపురం

తమపై రాజకీయంగా టిడిపి వారు ఎదుర్కోలేకా...అధికారులను అడ్డం పెట్టుకొని అక్రమ కేసులు బనాయిస్తున్నారని వైసిపి సమన్వయ కర్త దీపికా వేణురెడ్డి అరోపించారు. సోమవారం వైసిపి స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వైసిపి సమన్వయకర్త దీపిక, రాష్ట్ర బీసీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ రమేష్ గౌడ్, మధుమతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజకీయ కక్ష సాధింపు చర్యలు కొనసాగుతున్నాయని, పట్టణంలోనీ సూర్య వైన్స్ యజమాని ప్రశాంత్ గౌడ్ పై అక్రమ కేసు పెట్టారని ఆరోపించారు. హిందూపురం ఎక్సైజ్ సీఐ లక్ష్మి దుర్గయ్య సూర్య వైన్స్ యజమాని ప్రశాంత్ కు ఫోన్ చేసి నీపై అక్రమ కేసు పెడుతున్నాం... నన్ను క్షమించు, తప్పక అక్రమ కేసులు వన్ టౌన్ పోలీస్ స్టేషన్ లో పెడుతున్నానని చెప్పిన ఆడియో రికార్డును విడుదల చేశారు. ప్రశాంత్ గౌడ్ నిర్వహిస్తున్న మద్యం షాపు తమకు అప్పగించాలని కొన్ని రోజులుగా టీడీపీ నేతలు అధికారుల ద్వారా బెదిరిస్తున్నారని అన్నారు. బీసీల మీద అక్రమ కేసులు పెడుతున్న అధికారులు భారత రాజ్యాంగం ద్వారా ప్రభుత్వ ఉద్యోగం సాధించారా... రెడ్ బుక్ రాజ్యాంగం నుంచి ప్రభుత్వ ఉద్యోగం సాధించారా అని ప్రశ్నించారు. వందలాది అమాయక యువత మీద కేసులు పెడుతూ మరో పక్క యువతను రాజకీయాల్లోకి రావాలని పిలుపునివ్వడంలో ఆంతర్యం ఏమిటని నారా లోకేష్‌ను నిలదీశారు. అధికారులపై ఒత్తిళ్లు తెచ్చి వైసిపి నాయకులపై హిందూపురంలో అక్రమ కేసులు పెట్టిస్తున్నారని విమర్శించారు. ఈ అక్రమ కేసులపై న్యాయపోరాటం చేస్తామని అన్నారు. ఈ సమావేశంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిబంధనల మేరకే సూర్య వైన్ షాపుపై కేసు ఎక్సైజ్ సిఐ లక్ష్మి దుర్గయ్య

పట్టణంలోని పెనుకొండ రోడ్డులో ఉన్న సూర్య వైన్ షాపుపై ఎక్సైజ్ శాఖ నిబంధనల మేరకే కేసు నమోదు చేశామని ఎక్సైజ్ సిఐ లక్ష్మి దుర్గయ్య అన్నారు. సోమవారం ఎక్సైజ్ స్టేషన్‌లో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి పలు విషయాలను వెల్లడించారు. వైసిపి నాయకులు, సూర్య వైన్ యజమాని ప్రశాంత్ గౌడ్ విడుదల చేసిన వాయిస్ తనది కాదని స్పష్టం చేశారు. ఈ విషయంపై న్యాయ పోరాటం చేస్తానన్నారు. వడ్డే వెంకట్రాముడు అనే వ్యక్తి 11 మద్యం బాటిళ్లు విక్రయించడానికి తీసుకెళుతుండగా అందిన సమాచారం మేరకు ఎక్సైజ్ అధికారులు తనఖీలు నిర్వహించి కేసు నమోదు చేశారన్నారు. నియోజక వర్గంలో బెల్టు షాపులు లేవనానరు. బెల్టు షాపు ఎవరు నిర్వహిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేరాలు ఘోరాలు

యువకుడు ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-గుడిబండ

ప్రేమించి, నిశ్చితార్థం చేసుకున్న యువతి దక్కలేదని మనస్థాపానికి గురై ఓ యువకుడు గొంతు కోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన సోమవారం మండలంలోని మోపురుగుండు గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలు.. మోపురుగుండు గ్రామానికి చెందిన ఈరరామప్ప, నాగమ్మ దంపతుల ఏకైక కుమారుడు రామాంజి(25) పదో తరగతి వరకు చదివాడు. ఐదేళ్ల క్రితం బెంగళూరు వెళ్లి అక్కడ ఒక ఫ్యాక్టరీలో పని చేసేవాడు. రామాంజి మండలంలోని హీరేతుర్పి గ్రామానికి చెందిన ఓ యువతి ఐదేళ్లుగా ప్రేమించుకున్నారు. దీంతో ఇరుకుటుంబాల వారు డిసెంబర్ 5, 6 తేదీల్లో పెళ్లికి ముహూర్తం పెట్టి నిశ్చితార్థం కూడా చేసుకున్నారు. ఈ లోపే ఆ యువతి వేరే వ్యక్తితో వెళ్లిపోయింది. దీంతో మనస్థాపానికి గురైన రామాంజి సోమవారం స్థానిక సంత మార్కెట్‌లో గొంతు కోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు అతడిని ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా ప్రథమ చికిత్స అనంతరం మడకశిరకు ఆ తర్వాత హిందూపురం ఆసుపత్రికి తీసుకెళ్లారు. ప్రస్తుతం రామాంజి బెంగళూరులోని ఓ ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు సమాచారం. ఈ విషయంపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలుస్తోంది.

కుమార్తె కనబడటం లేదని ఫిర్యాదు

ప్రజాశక్తి-గుడిబండ

కుమార్తె కనిపించడం లేదని మండలంలోని హిరేతుర్పి గ్రామానికి చెందిన బోయ అంబికా పోలీసులకు ఫిర్యాదు చేశారు.. వివరాలు.. అంబికా కుమార్తె మౌనిక సోమవారం వేకువజామున 3 గంటల సమయంలో ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఆమె కోసం తల్లిదండ్రులు, బంధువులు పలుచోట్ల వెతికినా ఫలితం లేకపోయింది. కర్నాటకలోని పావగడ తాలూకా బుడసనపల్లి గ్రామానికి చెందిన చంద్రప్ప కుమారుడు బోయ కిరణ్‌పై వారు అనుమానం వ్యక్తం చేశారు. అతడిపై అంబిక స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు.

ఆలయ గోపుర కలశం చోరీ

ప్రజాశక్తి - గోరంట్ల

మండలంలోని బూదిలి గ్రామంలో చిత్రావతి నది ఒడ్డున వెలసిన శివాలయం గోపురం పైభాగంలో ఉన్న కలశాన్ని ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ విషయంపై గ్రామస్తులు ఫిర్యాదు చేయడంతో పోలీసులు ఆలయం వద్దకు వచ్చి పరిశీలించారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి - కదిరి టౌన్

చెక్కు అందజేస్తున్న నిసార్ యాసిన్‌ఖాన్

10వ తరగతి చదువుతున్న విద్యార్థుల కోసం యుటిఎఫ్ ఆధ్వర్యంలో తయారు చేసిన పదవ తరగతి మాదిరి ప్రశ్న పత్రాలను సిమ్స్ హాస్పిటల్స్ అధినేత నిసార్ యాసిన్ ఖాన్, యుటిఎఫ్ సీనియర్ నాయకులు మైనుద్దీన్ విడుదల చేశారు. కదిరి పరిసర మండలాలలోని వివిధ పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్న వెయ్యిమంది పదవ తరగతి విద్యార్థులకు ప్రశ్నపత్రాలను అందజేయడానికి నిసార్ యాసిన్‌ఖాన్ 80 వేల రూపాయలను యుటిఎఫ్ జిల్లా కోశాధికారి డి శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి తాహెర్‌వలికి అందజేశారు. ఈసందర్భంగా నాయకులు నిసార్ యాసీన్ ఖాన్ ను అభినందించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు ఆజం బాషా, మల్లికార్జున, సంతోష్ కుమార్, మధుసూదన్, రాజేష్, వెంగమ నాయుడు, ఖాజా,రవివర్ధన్ రెడ్డి, నజీర్, సుధాకర్, మహబూబ్ బాషా, బాబాజాన్, హరిప్రసాద్, భార్గవ్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఐసిడిఎస్ కార్యాలయంలో అక్రమ వసూళ్లు

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ధర్మవరంలోని ఐసిడిఎస్ కార్యాలయంలో అక్రమ వసూళ్లు యథేచ్ఛగా సాగుతున్నాయని ఎఐఎస్‌బి జిల్లా ప్రధాన కార్యదర్శి పోతులయ్య, సహాయ కార్యదర్శి సాయి గౌతమ్ విమర్శించారు. ఈ సందర్భంగా ఆయన సోమవారం తమ డిమాండ్లతో కూడిన వినపత్రాన్ని పుట్టపర్తి స్పందన కార్యక్రమంలో జెసికి అందజేశారు. అనంతరం పోతులయ్య మాట్లాడుతూ పట్టణంలోని సిడిపిఒ కార్యాలయంలో ఏళ్ల కొద్ది పాతుకుపోయిన కోఆర్డినేటర్ నరేందర్ రెడ్డి అక్రమాలకు పాల్పడుతుంటే న్యాయమైన విచారణ చేయకుండా సస్పెండ్ చేయకుండా వెనకేసుకొస్తూ సమస్యల సృష్టించడం చాలా దారుణమని అన్నారు. అంగన్వాడీల నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని , అంగన్వాడీ టీచర్లను నానా రకాలుగా ఇబ్బందులు పెడుతున్నారని ఆరోపించారు. కోఆర్డినేటర్ వ్యవహారశైలిపై ఐసిడిఎస్ పిడికి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని విమర్శించారు. పైపెచ్చు అక్రమాలకు పాల్పడుతున్న ఉద్యోగికి వంతపాడుతున్నారని ఆరోపించారు. జిల్లా మెజిస్ట్రేట్ ఎంక్వయిరీ చేయమని ఆదేశాలిస్తే ఆ ఆదేశాన్ని గాలికి వదిలేసి అన్యాయాలకు పాల్పడుతున్న నరేంద్రరెడ్డిని వెనకేసుకోరావడం దారుణమని అన్నారు. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న నరేందర్ రెడ్డి వ్యవహారశైలిపై తక్షణమే విచారణ జరిపించి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు మురళి, జయ, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి

ప్రజాశక్తి - కొత్తచెరువు

ఇటీవల హిందూపురంలో తొమ్మిది సంవత్సరాల బాలికపై అత్యాచార యత్నానికి పాల్పడిన నిందితున్ని కఠినంగా శిక్షించాలని. సిపిఎం మండల కార్యదర్శి ముత్యాలప్ప, సిఐటియు కో– కన్వీనర్ శంకర్ రెడ్డి, ఐద్వా జిల్లా కార్యదర్శి శ్రావణి డిమాండ్ చేశారు. నిందితుడు గోపీని వెంటనే అరెస్టు చేయాలని కోరారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ కిరణ్‌కి సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు ఆజాం, చంద్రకళ, అరుణ, తదితరులు పాల్గొన్నారు.

వాహనాల వేలం

ప్రజాశక్తి - చిలమత్తూరు

చిలమత్తూరు పోలీస్ స్టేషన్ పరిదిలో వివిధ కేసులలో పట్టుబడిన 29 వాహనాలలో 26 వాహనాలకు ఎక్సైజ్ సూపరెండెంట్ గోవింద్ నాయక్ ఆధ్వర్యంలో సోమవారం వేలం పాట నిర్వహించారు. ఈ వేలం పాటలో అధికంగా పాడుకున్న వారు వాహనాలు స్వంతం చేసుకున్నారు. ఈ వాహనాల వేలం ద్వారా 9,31,020రూపాయల ఆదాయం వచ్చినట్లు ఎస్ఐ మునీర్ ఆహ్మద్ తెలిపారు.

సమానపనికి సమాన వేతనం ఇవ్వాలి

ప్రజాశక్తి - బుక్కపట్నం

సమాన పనికి సమాన వేతనం కల్పించి సమగ్ర శిక్షలో పనిచేస్తున్న ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించాలని సమగ్ర శిక్ష అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు ఓబిరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో సమగ్ర శిక్ష నందు వివిధ హోదాలలో ఉన్న అవుట్‌సోర్సింగ్ సిబ్బంది ర్యాలీ నిర్వహించి తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వివిధ హోదాలలో పనిచేస్తున్న తమకు వేతనాలు పెంచలేదని,తమ డిమాండ్లను నెరవేర్చలేదని విమర్శించారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం కల్పించాలని, ప్రభుత్వ జీవో ప్రకారం జూన్ 2014 ముందు పనిచేసే వారందరినీ రెగ్యులర్ చేయాలని, వేతనంతో కూడిన మెడికల్ లీవులు మంజూరు చేసి, హెల్త్ కార్డులు, కారుణ్య నియామకాలు చేపట్టి, రిటైర్మెంట్ గా డ్యూటీ పది లక్షల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరంకలెక్టర్ శ్యాం ప్రసాద్ కు తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రామన్న, నాయకులు ఓబులేసు, హారున్ భాష, గోవిందరెడ్డి, భాస్కర్, కిష్టప్ప, భాస్కర నాయుడు, శంకర్ నాయక్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రత్యేక గ్రీవెన్స్

ప్రజాశక్తి హిందూపురం

ప్రజా సమస్యలను పరిష్కరించడం కోసం స్థానిక ఎమ్మెల్యే బాలకృష్ణ సూచనల మేరకు ప్రత్యేక గ్రీవెన్స్ ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే కార్యదర్శులు శ్రీనివాసరావు, వీరయ్య, బాలాజీ పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎమ్మెల్యే నివాసం వద్ద మండల స్థాయిలో ఉన్న అందరి అధికారులతో కలిసి ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. ఈ సందర్భంగా హిందూపురం రూరల్ మండలం వ్యాప్తంగా 14 గ్రామ పంచాయితీలలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అర్జీ రూపంలో వివరించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ వెంకటేశు, ఎంపీడీవో, గహ నిర్మాణ శాఖ, పంచాయతీరాజ్ శాఖ, విద్యుత్ శాఖ, విద్యాశాఖ తో పాటు మండల స్థాయిలో ఉన్న అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

చట్టబద్ధమైన దత్తత శ్రేయస్కరం

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

ప్రతి సంవత్సరం నవంబర్‌ను దత్తత మాసంగా నిర్వహించాలని సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీ (సి ఎ ఆర్ ఎ) సూచనల మేరకు కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో, జిల్లాలో చట్టబద్ధమైన దత్తతపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ ఎం. మౌర్య భరద్వాజ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ రూపొందించిన దత్తత అవగాహన గోడపత్రికలను జాయింట్ కలెక్టర్ అధికారులతో కలిసి ఆవిష్కరించారు.

సత్యసాయి శతజయంతి ఉత్సవాలు విజయవంతం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి కొత్తచెరువు

మాట్లాడుతున్న ఎమ్మెల్యే

సత్య సాయి బాబా శత జయంతి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించి దిగ్విజయంగా పూర్తి చేశామని పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి పేర్కొన్నారు. సత్య సాయి బాబా శతజయంతి వేడుకలు దిగ్విజయం చేసినందుకు రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగానికి, సత్యసాయి ట్రస్ట్ సభ్యులకు, సత్యసాయి భక్తులకు ఎమ్మెల్యే ప్రత్యేక కృతజ్ఞతలు తెఇపారు. ఈ సందర్భంగా ఆమె మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి తో కలిసి సోమవారం అనంతపురం పి వీ కేకే కళాశాల ప్రాంగణంలోని ప్రత్యేక కాన్ఫరెన్స్ హాల్లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పుట్టపర్తి నియోజకవర్గం తొలి మహిళా ఎమ్మెల్యేగా సత్య సాయి బాబా శతజయంతి వేడుకలు నిర్వహించుకోవడం తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్తులో పుట్టపర్తి ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్ర అభివృద్ధిలో సత్యసాయి సాయి భక్తులు భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.

సచివాలయాలు రెండు.. కార్యదర్శి ఒకరు..!

ప్రజాశక్తి నల్లచెరువు

నల్లచెరువు మేజర్ పంచాయతీలోని రెండు సచివాలయాలకు ఒకే కార్యదర్శి ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీలో దాదాపు పదివేల జనాభా ఉండగా రెండు సచివాలయాలు ఉన్నాయి అయితే సచివాలయం రెండుకు సంబంధించిన పంచాయతీ కార్యదర్శి బదిలీపై వెళ్లడంతో రెండు సచివాలయాలకు ఒకే కార్యదర్శి విధులు నిర్వహిస్తున్నారు. కార్యాలయ పని, శానిటేషన్, వాటర్, హౌసింగ్ తదితర విభాగాలకు ఆ అధికారే చూస్తుండటంతో ఆయనకు పనిఒత్తిడి పెరిగింది. దీంతో సకాలంలో పనులు జరగడం లేదు. వీటితో పాటు పీఎం కిసాన్ రైతు భరోసా పథకం వర్తించని అర్హులైన రైతులు సమస్యను పరిష్కరించుకోవటానికి సచివాలయాలకు వస్తున్నారు. దీంతో అటు ప్రజలు, ఇటు అధికారి ఇబ్బందులు పడుతున్నారు. పనిఒత్తిడి, ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని కార్యదర్శిని నియమించాలని పంచాయతీ ప్రజలు కోరుతున్నారు.

కౌన్సిలర్ వేధిస్తున్నాడని మహిళ ఫిర్యాదు

ప్రజాశక్తి-హిందూపురం

గతంలో కురిసిన వర్షాలకు తన సొంత స్థలంలో నిర్మాణం చేసుకున్న ప్రహరీ కూలిపోవడంతో అదే స్థలంలో ప్రహరీ నిర్మాణం చేస్తుంటే ఆ వార్డు కౌన్సిలర్ తమను వేధిస్తున్నాడని బెంగళూరు రోడ్డులో నివాస ఉంటున్న మహిళ ఆరోపించింది. ఈ మేరకు ఆమె మున్సిపల్ కమిషనర్ మల్లికార్జునను సోమవారం కలిసి తమ సమస్యను వివరించింది. తనకు భర్త లేదని, తన అత్తమామలకు వయసు మీరిందని, పెద్దల నుంచి సక్రమించిన ఆస్తిని కాపాడుకోవాలని, గోడ కూలిపోతే ఆ గోడను నిర్మాణం చేస్తుంటే ఆ వార్డు కౌన్సిలర్ తమను వేధిస్తున్నాడని వాపోయింది. స్పందించిన మున్సిపల్ కమిషనర్ వార్డు కౌన్సిలర్ పై తమకు చర్యలు తీసుకుని అధికారం లేదని, మున్సిపల్ సిబ్బంది ఎవరైనా వేధించి ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.నిబంధనల మేరకు మండల కార్యాలయంలో ఫీజు చెల్లిస్తే మండల సర్వేయర్ వచ్చి సర్వే చేస్తారని సూచించారు.

నీటమునిగిన పంటలు

పరిశీలించిన సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - చిలమత్తూరు

మండలంలోని కొడికొండ పాత చెరువుకు ఏర్పడిన గండి కారణంగా నీటమునిగిన పంట పొలాలను సిపిఎం నాయకులు సోమవారం పరిశీలించారు. గండి కారణంగా నీరు కిందనున్న పొలాల్లోకి చేరి మొక్కజొన్నతో పాటు పలు పంటలు నీటమునిగి భారీ నష్టం జరిగినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకుడు ఫిరంగి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ చెరువు గండితో దాదాపు 100 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని తెలిపారు. రైతులు పలుమార్లు గండి ప్రమాదం గురించి ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడం వల్లే ఈ నష్టం జరిగిందని విమర్శించారు. 15 ఏళ్లుగా ఇదే సమస్య కొనసాగుతున్నా అధికారులు శాశ్వత పరిష్కారం తీసుకోకపోవడం వారి నిర్లక్ష్యానికి నిదర్శమని అన్నారు. పంట నష్టంతో ఇబ్బందులు పడుతున్న రైతులకు వెంటనే నష్టపరిహారం అందజేయాలని, చెరువును శాశ్వతంగా పునరుద్ధరించే చర్యలు ప్రభుత్వం తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు వెంకటేష్, సాగు నీటి సంఘం అధ్యక్షుడు వెంకటరామప్ప, రైతు మంజు, బాలసుబ్రహ్మణ్యం, తిమ్మప్ప, అశ్వత్థప్ప, రాజప్ప, బాబు తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

నీటమునిగిన పంటను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

రైతన్నా మీకోసంలో అధికారులు, నాయకులు

జిల్లా వ్యాప్తంగా కార్యక్రమాలు

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట

ప్రజాశక్తి - కదిరి అర్బన్

రైతు సంక్షేమమే తమ ధ్యేయమని ఆ రైతులను ఏ విధంగానూ ఆదుకోని జగన్మోహన్‌రెడ్డి ఏ మొఖం పెట్టుకోని రైతుల దగ్గరికి వెళ్తున్నారని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ప్రశ్నించారు. మండల పరిధిలోని కొండమనాయుని పాలెంలో రైతన్నా మీకోసం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కందికుంట మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి తీరుపై తీవ్ర విమర్శలు చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అమలు చేస్తున్న పథకాలను వివరిస్తూ ధైర్యంగా మనస్ఫూర్తిగా రైతుల దగ్గరికి వెళుతున్నామని దీంతో రైతులు కూడా సంతోషం వ్యక్తం చేస్తున్నారని అన్నారు, జగన్మోహన్ రెడ్డి జీవితమంతా అబద్దాలేనని విమర్శించారు. రాయలసీమ ప్రాంత రైతాంగానికి నీళ్లు ఇచ్చిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకే దక్కుతుందన్నారు. ఈ ప్రాంతంలో దుర్భరమైన పరిస్థితులు ఒకప్పుడు నెలకొన్నాయని, రైతులు వర్షాలు లేక గతంలో ఇబ్బందులు పడే వారని అన్నారు. నేడు ఆ పరిస్థితులు లేవన్నారు. కృష్ణా జలాలతో రాయలసీమ ప్రాంతానికి నీరు ఇస్తున్నామన్నారు. రాష్ట్రంలో సన్న కారు రైతు దగ్గర నుంచి పెద్ద రైతుల వరకు ఆనందంగా ఉన్నాయని చెప్పారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న పాలనను చూసి జగన్మోహన్ రెడ్డి ఏమి చేయాలో దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారులు స్థానిక కూటమి నాయకులు అధికారులు పాల్గొన్నారు.

గాండ్లపెంట : మండలంలోని గాండ్లపెంట వేపరాల తదితర గ్రామాలలో సోమవారం రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఎఒ సయ్యద్ షాదాబ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ జి సోమశేఖర్ రెడ్డి, తహశీల్దార్ బాబురావు, ఆర్ఐ జాఫర్, సచివాలయ సిబ్బంది, కూటమి నాయకులు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 24 నుంచి 29 వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు డిసెంబర్ మూడవ తేదీ అన్ని రైతు సేవా కేంద్రాలలో గ్రామసభ నిర్వహించి ప్రణాళికల సిద్ధం చేస్తామని తెలిపారు ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది రాజేష్, ధనలక్ష్మి, కూటమి నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు

తలుపుల: మండలంలోని పెద్దన్నవారిపల్లి పంచాయతీలో రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది రామకృష్ణా రెడ్డి, ఉదయ్, టిడిపి నాయకులు మేడా శంకర్, రమణ, వెంకట నారాయణ, డి వి నారాయణ, కుమార్, అమర తదితరులు పాల్గొన్నారు.

నంబుల పూలకుంట : రైతును రాజుగా చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం ఏవో లోకేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని రైతు భరోసా పిఎం కిసాన్ నిధులు సకాలంలో రైతుల ఖాతాలో జమ చేస్తున్నారని తెలిపారు రైతులకు ఈ పథకం వర్తించని వారు సమీపంలోని రైతు సేవ కేంద్రాలలో ఫిర్యాదు చేయాలని సూచించారు రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ దేవేందర్ నాయక్, ఎంపీడీవో పార్థసారథి, డిప్యూటీ ఎంపీడీవో మాధవరెడ్డి, క్లస్టర్ ఇంచార్జ్ దండ రవిశంకర్ గంగిరెడ్డి తదితరులతో పాటు రైతులు పాల్గొన్నారు.

నల్లమాడ : మండలం కేంద్రంలోని మెయిన్ బజారులో రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని సోమారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ శ్రీనివాసులు, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు, తెలుగుదేశం నాయకులు మైలే శంకర, డాక్టర్ బుట్టి నాగభూషణం నాయుడు, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ : మండలకేంద్రంలోని పాతవూరులో సోమవారం రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారి రవీంద్ర ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల క్లస్టర్ ఇంచార్జ్ మనోహర్, సచివాలయం అగ్రికల్చర్ శివకుమార్, ఆనంద, అమరనాథ్, నారాయణస్వామి, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

కొత్తచెరువు : రైతన్నా మీకోసం ఇంటింటా సర్వే కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ అధికారి సతీష్ బాబు తెలిపారు. సోమవారం నుంచి ఈ నెల 29వ తేదీ వరకు మండల వ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. సోమవారం మండల పరిధిలోని కోడపగాని పల్లి, మైల్ సముద్రంగ్రామంలో, వ్యవసాయ అధికారులు ఇంజనీరింగ్ అసిస్టెంట్లు రెవిన్యూ అధికారులు కలిసి ఇంటింటా సర్వే నిర్వహించి కరపత్రాలను పంపిణీ చేశారు. రాబోయే ఐదు సంవత్సరాలలో రైతులు చేపట్టవలసిన విధానాలపై అవగాహన కల్పించారు. రైతుల అభివృద్ధి కోసం ప్రభుత్వం అన్నదాత సుఖీభవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారన్నారు ప్రభుత్వం రైతుల కొరకు యాప్ ప్రారంభించిందని అందులో రిజిస్ట్రేషన్ చేసుకుంటే రైతులకు కావలసిన సమాచారాన్ని అందజేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఈవో సునీత, వీఆర్వో భార్గవ్, సచివాలయ సిబ్బంది రైతులు టిడిపి నాయకుడు శివ తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం: రైతులను అన్ని విధాలా ఆదుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందేలా చేయడమే ప్రభుత్వ లక్ష్యమని వ్యవసాయ, అనుబంధ విభాగాల అధికారులు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టినటువంటి 'రైతన్నా మీకోసం' కార్యక్రమాన్ని సోమవారం హిందూపురం మండలం బీరేపల్లి గ్రామపంచాయతీలో వ్యవసాయ అధికారి సురేంద్రనాయక్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. అలాగే హిందూపురం మండలం లోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో "రైతన్నా మీకోసం" ఇంటింటా సర్వే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హిందూపురం మార్కెట్ యార్డ్ చైర్మన్ అశ్వర్థ నారాయణ రెడ్డి, కిరికెర సింగల్ విండో అధ్యక్షులు శంకర్, సర్పంచి శ్రీనివాస్ రెడ్డి, ఉద్యాన అధికారి మహేష్ ,అంజిరెడ్డి, కేశవరెడ్డి ,సత్యనారాయణ రెడ్డి, రామకృష్ణ రెడ్డి, హనుమంతరాయుడు, రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.